తెలంగాణ

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ముచ్చట్లు


ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం-16-సెప్టెంబర్-2025 | సంపుటి : 3 | సంచిక : 111 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలి

- వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలి
- గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లు అమర్చండి
- జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించండి
- నిర్వహణకు టెండర్లు పిలవాలని అధికారులకు ఆదేశం
- ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రమంతా ఎల్ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్ధంగా నిర్వహించే అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు.

పంచాయతీ రాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీ విభాగాలకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో



## రూ. 10 కోట్లకు బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా

- హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించిన కేటీఆర్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారన్న కేటీఆర్
- లీగల్ నోటీసుకు స్పందించకపోవడంతో కోర్టులో పిటిషన్

2లో

## అంగన్‌వాడీల్లో 15,274 ఉద్యోగాలు..

- నియామకాలకు ప్రభుత్వ కసరత్తు
- ఇతర రాష్ట్రాల నియామక విధానాల పరిశీలన

2లో



## యువతను ఆకర్షిస్తున్న ట్రెండ్.. హెచ్చరిస్తున్న సజ్జనార్



- ఆన్‌లైన్‌లో వ్యక్తిగత ఫోటోలు పెట్టొద్దు
- వైరల్ అవుతున్న 'నానో బనానా' ఏఐ ట్రెండ్
- వ్యక్తిగత ఫోటోల మార్ఫింగ్‌తో భద్రతకు ముప్పు అని హెచ్చరిక
- ఏఐ వాటర్‌మార్కులు నమ్మశక్యంగా లేవంటున్న టెక్ నిపుణులు
- నకిలీ యాప్‌ల ద్వారా డేటా చోరీ, ఆర్థిక మోసాల ప్రమాదం
- గూగుల్ 'నానో బనానా' ఏఐ టూల్ పై వీసీ సజ్జనార్ హెచ్చరిక!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సోషల్ మీడియాలో ప్రస్తుతం ఓ కొత్త ట్రెండ్ విపరీతంగా వైరల్ అవుతోంది. తమ ఫోటోలను ప్రత్యేకమైన 3డి బొమ్మల రూపంలోకి, పాతతరం బాలీవుడ్ హీరోయిన్ల చీరకట్టు శైలిలోకి మార్చుకొని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం బాగా ప్రాచుర్యం పొందింది.

మిగతా 2లో



## కలెక్టరేట్ లో ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వృద్ధుడు..!

- కొడుకు, కోడలు పోషించడం లేదని మనస్తాపానికి గురై..

రాజన్న సిరిసిల్ల, (తెలంగాణ ముచ్చట్లు)

కొడుకు, కోడలు పోషించడం లేదని మనస్తాపానికి గురైన ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండలానికి చెందిన అజ్మీరా విఠల్ అనే వ్యక్తి సిరిసిల్ల

మిగతా 2లో

## ఉప ఎన్నికలు రావడం ఖాయం

- మీకు రాజకీయ భవిష్యత్ లేకుండా ప్రజలు చేయడం ఖాయం
- కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్ రెడ్డి, అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ వివేకానంద, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తదితరులు స్పీకర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. స్పీకర్‌ను కలిసిన అనంతరం వారు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు.

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ..



'మేం సుప్రీంకోర్టుకు వెళ్ళడంతో ఎమ్మెల్యేల అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం చేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది.

మిగతా 2లో

## రైతులకు నష్టపరిహారం అందజేత

- పూజారుల అంగీకారం మేరకే గద్దెల ప్రాంతంలో మార్పిడి.
- దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయవద్దు
- మంత్రి సీతక్క

2లో





## ఆదివాసీల ఆచారాలు దెబ్బతినకుండా గుడి ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తాం

- యుద్ధ ప్రాతిపదికన గుడి నిర్మాణం
- అమ్మవార్ల చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర మంత్రి సీతక్క

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల ఆచారాలు దెబ్బ తినకుండా మేడారంలోని అమ్మవార్ల గద్దెలను సుందరంగా

2లో

## నాలాల్లో పడి గల్లంతైనవారికోసం గాలింపు

- అఫ్జల్‌సాగర్, వినోభా కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నాలాల్లో పడి ఆదివారం గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం హైడ్రా ముమ్మరంగా గాలిస్తోంది. క్యాచ్‌పిట్లన్ని చోట్ల వెతుకుతోంది. ఆసిఫ్‌నగర్లోని అఫ్జల్ సాగర్ నాలాతో పాటు.. ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలా పరిసరాల్లో గాలింపు చర్యలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు క్షేత్ర స్థాయిలో సోమవారం ఉదయం పరిశీలించారు. ప్రతి క్యాచ్‌పిట్‌ను తెరిచి చూసిన తర్వాత వెంటనే వాటిని మూసి వేయాలని హైడ్రా సిబ్బందిని ఆదేశించారు. గాలింపు చర్యలను మిగతా శాఖలతో కలిసి ముమ్మరం చేయాలని సూచించారు. హైదరాబాద్ కలెక్టర్ శ్రీమతి హరిచందన గారు కూడా



అఫ్జల్ సాగర్ ప్రాంత్రంలో కమిషనర్‌తో పాటు గాలింపు చర్యలను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కురిసిన భారీ వర్షానికి ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్ సాగర్ నాలాలో అక్కడే నివాసం ఉంటున్న మామ, అల్లుడు అర్జున్(26), రాము(25)తో పాటు.. ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలాలో దినేష్‌అలియాస్‌సన్నీ(26) గల్లంతైన విషయం విధితమే. సోమవారం కూడా గాలింపును హైడ్రా ముమ్మరం చేసింది.

**నాలా ఆక్రమణలే ప్రమాదాలకు కారణం..**

నాలాల ఆక్రమణలే ప్రమాదాలకు కారణమని గాలింపు చర్యలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు చెప్పారు. నాలాలను ఆక్రమించి నిర్మించడమే కాకుండా.. వాటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా దారి మళ్లించడంతో వరద సాఫీగా సాగడంలేదన్నారు. వరద ప్రవాహానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఒకటి రెండు కట్టడాలనే తొలగిస్తామని.. మిగతా వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని కమిషనర్ స్పష్టం చేశారు. నాలాల చెంతన పేదలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. తప్పనిసరై కూల్చి వేయాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం ప్రభుత్వం చూస్తుందన్నారు. మిగతావారెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఆ సింపతీ ఉందని.. హైడ్రా కూడా అదే తీరుతో పని చేస్తున్నదని చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రూ. 10 కోట్లకు బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై బండి సంజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా తీవ్రమైన ఆరోపణలు చేశారని, దీనివల్ల తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ కేటీఆర్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరుతూ కేటీఆర్ తరపు న్యాయవాదులు ఆగస్టు 11న బండి సంజయ్‌కు లీగల్ నోటీసు పంపారు. అయితే, ఆ నోటీసులకు బండి సంజయ్ స్పందించకపోవడంతో పాటు, క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో కేటీఆర్ న్యాయపోరాటానికి దిగారు. ఈ క్రమంలోనే ఆయన సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ దావాలో కేటీఆర్ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. బండి సంజయ్ తనపై చేసిన ఆరోపణలకు గాను బేషరతుగా, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో తన పరువుకు నష్టం కలిగించేలా ఎటువంటి వ్యాఖ్యలు, ప్రసంగాలు, ప్రచురణలు చేయకుండా బండి సంజయ్‌ను నిరోధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అలాగే, ఇప్పటికే ఆన్‌లైన్ వేదికలు, సామాజిక మాధ్యమాలు, ఇతర వార్తా మాధ్యమాలలో ఉన్న పరువు నష్టపరిచే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

# అంగన్‌వాడీల్లో 15,274 ఉద్యోగాలు..

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని త్వరలోనే భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతులు, ఉద్యోగ విరమణతో ఏర్పడిన ఖాళీల వివరాలను సేకరించింది. దీంతో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15,274 ఖాళీలు ఉన్నట్లు లెక్కతేలింది. నియామక విధానంలో అవసరమైన మార్పులు చేసేందుకు సర్కార్ దృష్టి సారించింది. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. సిబ్బంది కొరత వల్ల అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది కొరత కారణంగా పోషకాహారం పంపిణీ, పూర్వప్రాథమిక విద్య వంటి కీలక సేవలు సక్రమంగా అందడం లేదు. కొన్ని కేంద్రాల్లో సహాయకులు అందుబాటులో లేకపోవడంతో పోషకాహారం అందించడం కష్టంగా మారుతోంది. టీచర్లు లేనిచోట విద్యార్థులకు పూర్వప్రాథమిక విద్య అందడం కాష్టసాధ్యంగా మారింది. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని అంగన్వాడీల్లో ఖాళీల వివరాలను ప్రభుత్వం సేకరించింది. మొత్తం 15,274 ఖాళీలు ఉండగా.. వీటిలో 2,999 టీచర్ పోస్టులు, 12,275 సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన అంగన్‌వాడీ సిబ్బంది నియామకాల భర్తీకి సంబంధించి ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులపై సర్కార్ దృష్టిసారించింది. దక్షిణాది రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను శిశు సంక్షేమశాఖ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించింది. అంగన్వాడీ టీచర్ల నియామకాలకు తెలంగాణలో ఇంటర్ విద్యార్హతతో ఆన్‌లైన్ పరీక్షలు, ఏపీలో పదోతరగతి విద్యార్హతతో పరీక్షలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మౌఖిక పరీక్షలకు 20 మార్కులు కేటాయించారు. కేరళలో మాత్రం ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి మెరిట్ ఆధారంగా స్థానిక మహిళల్ని ఎంపిక చేస్తున్నారు. కర్ణాటకలో 12వ తరగతి ఉత్తీర్ణత కలిగిన వారికి ఈ పోస్టులను కేటాయిస్తున్నారు. ముఖ్యంగా ఈసీసీఈ, నర్సరీ, ఎన్‌టీటీ డిప్లొమా అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇక తమిళనాడులోనూ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, టీచర్ ఇంటర్, హెల్పర్‌కు పదోతరగతి అర్హతలుగా నిర్ణయించారు. ఇక్కడ కూడా మెరిట్ ఆధారంగా పోస్టులకు ఎంపిక చేస్తున్నారు.

# యువతను ఆకర్షిస్తున్న ట్రెండ్.. హెచ్చరిస్తున్న సజ్జనార్

(మొదటి పేజీ తరువాయి)



గూగుల్ సంస్థకు చెందిన 'జెమిని నానో బనానా' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్ ద్వారా ఈ ఫోటోలను క్రియేట్ చేస్తున్నారు. 'నానో బనానా', 'బనానా ఏఐ శారీ' పేర్లతో నడుస్తున్న ఈ ట్రెండ్ చూడటానికి చాలా సరదాగా ఉన్నప్పటికీ, దీని వెనుక తీవ్రమైన ప్రైవసీ, భద్రతాపరమైన ముప్పులు పొంచి ఉన్నాయని టెక్నాలజీ నిపుణులు, సైబర్ క్రైమ్ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ ట్రెండ్‌పై తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. అధికారిక ప్లాట్‌ఫామ్‌లను పోలిన నకిలీ వెబ్‌సైట్లు లేదా యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, ఆర్థిక మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఒకసారి మన డేటా అనధికారిక ప్లాట్‌ఫామ్‌లకు చేరితే, దాన్ని తిరిగి పొందడం దాదాపు అసాధ్యమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత నెలలో ప్రారంభమైన ఈ ఏఐ టూల్, అప్‌లోడ్ చేసిన ఫోటోలను క్షణాల్లో ఆకర్షణీయమైన చిత్రాలుగా మారుస్తుండటంతో యువత దీనికి బాగా ఆకర్షితులవుతున్నారు. అయితే, ఈ ప్రక్రియలో వినియోగదారులు తమ వ్యక్తిగత ఫోటోలను థర్డ్‌పార్టీ ప్లాట్‌ఫామ్‌లకు అప్పగించాల్సి వస్తోంది. ఇక్కడే అసలు ప్రమాదం మొదలవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల డేటాను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను సృష్టించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు కాగా, సున్నితమైన ఫోటోలను, లొకేషన్ వివరాలను ఇలాంటి ఏఐ టూల్స్‌కు అప్‌లోడ్ చేయకపోవడమే మంచిదని నిపుణులు సలహా ఇస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రైవసీ సెట్టింగులను కఠినతరం చేసుకోవడం ద్వారా కొంతవరకు ముప్పును తగ్గించుకోవచ్చని వారు పేర్కొన్నారు.

తాము రూపొందించిన ఏఐ చిత్రాలపై 'సింథ్‌ఐడీ' అనే కంటికి కనిపించని డిజిటల్ వాటర్‌మార్క్‌ను ముద్రిస్తున్నట్లు గూగుల్ చెబుతోంది. దీనివల్ల ఏది ఏఐ చిత్రమో గుర్తించవచ్చని పేర్కొంటోంది. కానీ, ఈ వాటర్‌మార్క్‌లను గుర్తించే టూల్స్ సాధారణ ప్రజలకు అందుబాటులో లేవు. పైగా, ఇలాంటి వాటర్‌మార్క్‌లను సులభంగా తొలగించవచ్చని లేదా మార్చేయవచ్చని సైబర్ భద్రతా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. "వాటర్‌మార్కింగ్ విధానం ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దాన్ని సులభంగా ఫేక్ చేయవచ్చు. నిజ ప్రపంచంలో దీని ప్రభావం చాలా పరిమితం" అని రియాలిటీ డిఫెండర్ సీఈఓ బెన్ కోల్‌మన్ తెలిపారు. యూసీ బర్క్‌లీ ప్రొఫెసర్ హానీ ఫరిద్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, వాటర్‌మార్కింగ్ మాత్రమే పూర్తిస్థాయి పరిష్కారం కాదని, అదనపు భద్రతా చర్యలు తప్పనిసరి అని అన్నారు.

# గ్రామాల్లో ఎల్‌ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)



వీధి దీపాలకు సంబంధించి గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న లైట్లు వెలుగుతున్నాయా లేదా, కొత్తగా ఎన్ని అవసరం ఉన్నాయో పక్కాగా అంచనా వేయాలని, ప్రతి పోల్ లెక్కించేలా సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.

రాత్రి పూట ఎల్‌ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్‌ఈడీ డ్యాష్‌బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు.

రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్‌ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్‌ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉందని అధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రంలో అన్ని ఎల్‌ఈడీ లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్‌ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ నివేదించింది.

కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్‌ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్‌ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని చెప్పారు. కొత్తగా ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించాలని చెప్పారు.

ఎల్‌ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్‌ల ఏర్పాటు, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ. 8 కోట్ల కరెంటు బిల్లు అవుతున్నందున, సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వృద్ధుడు..!

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టరేట్ కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో విఠల్ తన భార్య విరవ్వతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చాడు. తన కుమారుడు నరేష్ నాయక్, కోడలు తమను సరిగా పోషించడం లేదని, ఉన్న భూమిని కూడా వారే సాగు చేసుకుంటూ తమకు అన్నం పెట్టడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ క్రమంలోనే, మనస్తాపానికి గురైన విఠల్ అక్కడే పురుగుల మందు తాగాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు అతడిని చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విఠల్ అక్కడ చికిత్స పొందుతున్నాడు.

# రైతులకు నష్టపరిహారం అందజేత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

గిరిజన గోత్రాలు, పూజ ఆచారాల ప్రకారం అమ్మవార్ల పూజారుల అంగీకారం పూర్తి అయిన అనంతరమే గద్దెల ప్రాంతంలో నూతన టెక్నాలజీతో పనులను ప్రారంభించడం జరుగుతుందని, పూర్తిస్థాయిలో డీపీ ఆర్ పూర్తికాగానే ముఖ్యమంత్రి ముందు సమావేశమై పూర్తి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములు అప్పగించిన 41 మంది కి ఇంచర్లలోని ఏకో పార్క్ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి పట్టాలను అందచేశారు.

`రైతులకు నష్టపరిహారం అందజేత

ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ మహా మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పలు గ్రామాల గుండా రోడ్డు విస్తరణ పనులు చేయడమే కాకుండా

డైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేయబోతున్నామని, దీనికి సంబంధించిన నివేదికలను సంబంధిత అధికారులు తయారు చేస్తున్నారని తెలిపారు. జాతర సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, గత జాతర సందర్భంగా రైతులకు నష్టపరిహారం అందించడం జరిగిందని అన్నారు. గత కొద్ది రోజులుగా గిరిజన పూజారులు, దేవాదాయశాఖ అధికారులత, ఆర్కేటిలాజి అధికారుల తో పలు దాఫాలుగా సమావేశం నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంలో పలు రకాల నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. పూర్తిస్థాయిలో డిపిఆర్ తయారు అయిన అనంతరమే పనులను వేగవంతం చేసి జాతరకు పక్షం రోజుల ముందే పనుల్లో ముగిస్తామని తెలిపారు. గిరిజన పూజారులు, భక్తుల విశ్వాసం దెబ్బ తినకుండా ఆలోచనలు చేస్తున్నామని, వెయ్యి సంవత్సరాలు నిలిచిపోయేలా మంచి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని, పనులు ప్రారంభం ప్రారంభించక ముందే పలువులు పలు రకాల ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ములుగు జిల్లా ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక ప్రాంతంగా తెరకెక్కిందని, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ, దట్టమైన అడవి ప్రాంతం తో పాటు పలు రకాల పర్యాటక ప్రాంతాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. గద్దెల ప్రాంతంలో చిన్న గద్దెలను మాత్రమే కొంత మార్పిడి చేసే అవకాశం ఉందని, గద్దెలపై రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. దేవుని దగ్గర రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారని , ప్రపంచవ్యాప్తంగా అమ్మవార్ల ప్రాముఖ్యత సంతరించుకున్నదని అన్నారు. ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకునే పనులను ప్రారంభించడం జరుగుతుందని, మేడారం ప్రాంతంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ను కోరారు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములు అప్పగించిన 41 మంది రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఉప ఎన్నికలు రావడం ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్ పదిమంది ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. దాంతో కొంతమంది ఎమ్మెల్యేలు 'మేం అమాయకులం, కేసీఆర్‌పైన నమ్మకం ఉంది' అని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. దాంతో స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాన్ని మాకు పంపిస్తూ మూడు రోజుల్లో మమ్మల్ని సమాధానం ఇవ్వాలని కోరారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఎక్కువ రోజులు సమయం ఇచ్చిన స్పీకర్ మాకు మాత్రం మూడు రోజులే సమయం ఇచ్చారు. స్పీకర్ గడువు ఇచ్చిన మూడు రోజుల్లోనే మేం సమాధానం ఇచ్చాం' అని అన్నారు. 'మేం పార్టీ మారలేదని, సీఎం దగ్గరకు వెళ్తే మా మెడలో మూడు రంగుల కండువా కప్పారని పార్టీ మారిన ఎమ్మెల్యేలు అమాయకంగా చెప్పారు. వారు అమాయాకత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ సభలు, సమావేశాల్లో పదిమంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం అని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పోచారం మాటలను ఏఐ ద్వారా ఏమైనా మార్ఫింగ్ చేశారా..? నా నియోజకవర్గంలో సమస్యలు ఉన్నాయంటే సీఎం మా ఇంటికి వచ్చారని పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డికి కేసీఆర్‌పై నమ్మకం ఉంటే కేసీఆర్ ఫోటో, కేసీఆర్ కండువా ఉండాలి కదా..? అభివృద్ధి కోసం సీఎంను కలిసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి రాహుల్ గాంధీ, మహేష్ కుమార్ గౌడ్‌ను ఎందుకు కలిశారు..?' అని ప్రశ్నించారు. 'జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ 'నేను నియోజకవర్గ అభివృద్ధి కోసం వెళ్తే సడెన్‌గా సీఎం కండువా కప్పారు' అని చెప్పారు. మరి సంజయ్ పేపర్ ప్రకటనల్లో కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉన్నారు..? గాంధీ భవన్, కాంగ్రెస్ పార్టీ మీటింగ్స్ లో పాల్గొంటే అభివృద్ధి ఎట్లా అవుతుంది..? వ్యక్తిగత ప్రయోజనాల కోసం పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. మేము తప్పుచేసి పార్టీ మారామని నియోజకవర్గ ప్రజల ముందు ఒప్పుకోవాలి. మేం పార్టీ మారలేదని కేసీఆర్ దగ్గర పిటిషన్ పెట్టుకోండి. నోటీసులు వచ్చాక కేసీఆర్ దగ్గరకు రావాల్సిన పదిమంది ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డి దగ్గరకు ఎందుకు వెళ్లారు..? ఎన్ని చేసినా పదిమంది ఎమ్మెల్యేలు తప్పించుకోలేరు. వాళ్లు దొరికిపోయిన దొంగలు. సీఎం రేవంత్ రెడ్డి మాటలతో దొరికి తప్పించుకున్నారు. మేం తప్పించుకోలేమా అని ఎమ్మెల్యేలు అనుకుంటున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ. పదిమంది ఎమ్మెల్యేలు ఇక్కడ తప్పించుకున్నా కోర్టు ముందు తప్పించుకోలేరు' అని అన్నారు.

# ఆదివాసీల ఆచారాలు దెబ్బతినకుండా గుడి ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దుతామని, యుద్ధ ప్రాతిపదిక పై గుడి నిర్మాణ ఏర్పాట్లు చేసి భక్తులకు అందుబాటులో తేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గిరిజనుల ఆచారాలు సాంప్రదాయాలు పూజార్ల అభిప్రాయం మేరకే నూతన గుడి నిర్మాణ ఏర్పాట్లు జరుగుతాయని ఆమె స్పష్టం చేశారు. సోమవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంగణం లో గిరిజన పూజారులు, ఆర్కిటిక్, దేవాదాయ అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. , ఎస్పీ డాక్టర్ శబరీష్ , పూజార్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు లతో కలిసి మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుందిన సమ్మక్క సారలమ్మ జాతరలో సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, గుడి ప్రాంగణాన్ని మార్పులు చేర్పులు చేయడంలో గత కొద్ది రోజులుగా పూజారులతో సమావేశం అవుతున్నామని అన్నారు. సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజు గోత్రాల ప్రకారం గుడి నిర్మాణ ఏర్పాట్లు జరుగుతాయని, దీనిపై గతంలోనే ముఖ్యమంత్రి సమక్షంలో సమావేశం నిర్వహించడం జరిగిందని అన్నారు. ఆ సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంత డబ్బు ఖర్చయినా వెయ్యి సంవత్సరాలు పాటు నిలిచిపోయేలా నిర్మాణం ఏర్పాట్లు జరగాలని ఆదేశించారని, గుడి గొప్పతనం తో పాటు భక్తుల విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారని తెలిపారు. చిన్న గద్దెల మార్పిడి వలన అపచారం జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయా పూజారుల అభిప్రాయం మేరకే పనులతో కొనసాగుతాయని, గద్దెల ప్రాంతాన్ని 20 ఫీట్ల వెడల్పుతో 80 ఫీట్ల పొడుగుతో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. సమ్మక్క సారలమ్మ పై అపారమైన నమ్మకం ఉన్న రేవంత్ రెడ్డి మా ప్రభుత్వం అధికారం రావడానికి పాదయాత్ర అమ్మవారి సన్నిధి నుండే ప్రారంభించారని, తల్లుల దీవెనల కోసం జాతరకు ముందు జాతర సమయంలో అమ్మవార్ల ఆశీస్సుల కోసం మేడారం రానున్నారని అన్నారు. రానున్న మేడారం మహా జాతర సందర్భంగా భక్తులు అవలీలంగా తల్లులు దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేయబోతున్నామని, భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వనదేవతల చరిత్ర 7 వందల రూపాలను పూజారులు గుర్తించి ప్రతిపాదించారని, పరిశీలించి గుడి చుట్టూ ఏర్పాటు చేయ బోతున్నామని , నూతన గుడి నిర్మాణం భక్తులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. యజ్ఞం కంటే ఎక్కువగా నిర్మాణ పనులు చేపట్టడమే కాకుండా భక్తుల విశ్వాసం పెరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పూజార్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు మాట్లాడుతూ గుడి నిర్మాణం చేస్తామని పాలకులు హామీ ఇవ్వడంతోనే తాము అనుమతి ఇస్తున్నామని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిర్మాణ పనులు పూర్తి చేయడానికి సహకరిస్తామని అన్నారు. నూతన గుడి నిర్మాణం ఏర్పాట్లపై పలు సంఘాల నాయకుల ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్, ఈ ఓ వీరస్వామి, గిరిజన పూజారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా అధ్యక్షుడిగా బరిగెల ప్రకాష్ ఏకగ్రీవ ఎన్నిక

**హసన్ పర్తి, సెప్టెంబర్ 15 ( తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ హక్కుల పరిరక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బరిగెల ప్రకాష్ నియామక పత్రాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మైస ఉపేందర్ మాట్లాడుతూ మాదిగ హక్కుల పరిరక్షణ సమితి సంఘం బలోపేతంలో భాగంగా అన్ని జిల్లాలలో నూతన కమిటీలు పూర్తి స్థాయిలో నియామకాలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేవెళ్ల అంబేద్కర్ అభయ హస్తం ద్వారా 12 లక్షలు దళితులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బరిగెల ప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలో సంఘ నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు వ్యవస్థాప అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంద ఆరోగ్యం, బైరపాక జోజి తదితరులు పాల్గొన్నారు.



# జనసేన నుండి కాంగ్రెస్‌లో చేరిక

## పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం పట్టణం 51వ డివిజన్ లో గత మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ నుండి కార్పొరేటర్ గా పోటీ చేసిన సింగారపు చంద్రమౌళి, 48 వ డివిజన్ సీనియర్ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు వంగూరి స్వామి లు సోమవారం కాంగ్రెస్ లో చేరారు. జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ముగ్గురు మంత్రుల ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీకి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. సింగారపు చంద్రమౌళి, వంగూరి స్వామి లు మాట్లాడుతూ.... పార్టీ విలువలకు కట్టుబడి ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పార్టీ సిద్ధాంతాలను కొనసాగిస్తానని, ఖమ్మం పట్టణ నాయి బ్రాహ్మణ సంఘ మాజి అధ్యక్షునిగా, సీనియర్ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకునిగా రాజకీయపరంగా తమకు ఎంతో అనుభవం ఉందని ఆ అనుభవాన్ని అనుకరిస్తూ పార్టీ అభివృద్ధికితమ వంతు కృషి చేస్తూ , పార్టీ అభివృద్ధికి అహర్నిశలుకష్టపడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు పి సి సి సభ్యులు,జిల్లా ఓబీసీ సెల్ అద్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడు ముంతల గంగరాజు యాదవ్,51వ డివిజన్ అద్యక్షులు జంపాల రామకృష్ణ, మేడారపు హరినాథ్,రాచమల్ల నరసింహారావు,సింగారపు కృష్ణ,రాచమల్ల జాని,మామిడాల కుమారస్వామి,జంపాల జంపన్న, దూదిపాళ్ళ ఉపేందర్, గొల్లపూడి ఉపేందర్, దాసు నాగరాజు,రాచమల్ల హనుమంతరావు,రామవరపు నాగరాజు నాయకులు పాల్గొన్నారు.



# సిపిఎం సానుభూతి పరురాలు మృతి...

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** చింతకాని మండల పరిధిలోని కోదుమూరు గ్రామానికి చెందిన దంతాల సీతమ్మ 55 సంవత్సరాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు ఆమె మృతదేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ పార్టీ జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు వారు మాట్లాడుతూ సీతమ్మ బ్రతికినంత కాలం పార్టీతో ఉన్నారని ఏ కార్యక్రమాలు జరిగినా ముందుండి పాల్గొనేవారు వారి కుటుంబం ఇప్పటివరకు పార్టీని అంటి పెట్టుకున్నారని ఆమె అకాల మరణం పార్టీకి ఎంతో తీరని లోటుగా భావిస్తున్నామన్నారు వారి కుటుంబానికి సిపిఎం పార్టీ ఎప్పుడు అండదండలుగా ఉంటుందని వారి కుటుంబానికి తెలిపారు కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాచబంటి రాము శాఖ సెక్రెటరీ నక్కన బోయిన శాంతారావు సీనియర్ నాయకులు తిగుళ్ల నాగులు మాదినేని రవి బందెల కళ్యాణ్ చిట్టి మోదు చిన్న లింగయ్య భయ్యా బాలాజీ శ్రీను పార్టీ సభ్యులు పాల్గొన్నారు.





# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ఎనలేని కృషి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్
- ఘనంగా మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో మహిళా కాంగ్రెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మహిళలకు న్యాయం జరగాలి అంటే కాంగ్రెస్ తోనే సాధ్యం అవుతుందని అన్నారు. మహిళల్ని రాజకీయంగా చైతన్యవంతం చేయాలని ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ నాయకత్వం 1952 లోనే కాంగ్రెస్ పార్టీకి మహిళా సెల్ ను ఏర్పాటు చేసిందని అన్నారు.1983 లో ముంబయి ఏఐసీసీ సమావేశంలో దీనికి పూర్తిస్థాయి స్వతంత్ర సమస్త హోగా ఇవ్వాలని తీర్మానం చేయడం జరిగిందని అన్నారు. అదే నేడు మహిళా కాంగ్రెస్ సంఘంగా ఏర్పాటు జరిగిందని తెలియజేశారు. ద్వారా మహిళలకు రాజకీయంగా ఎన్నో అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ... మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేడు రాష్ట్రంలో ఏ పథకం అమలు చేయాలన్న మహిళల పేరు మీదనే అమలు చేయడం మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవ మర్యాదలు ఏంటో తెలుసుకోవచ్చని అన్నారు. మహిళా సెల్ గా ఏర్పడిన మహిళా కాంగ్రెస్ 1984 లో ముంబై లో బెంగుళూరు లో జరిగిన జాతీయ మహాసభలో ఒక ఫ్రాంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా,మండల స్థాయిలో విస్తరించిందని తెలిపారు. అందుకే సెప్టెంబర్ 15న మహిళ కాంగ్రెస్ ఫౌండేషన్ డే గా ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరంతో మహిళా కాంగ్రెస్ ఏర్పడి 41 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని అన్నారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరొకసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు పి సి సి సభ్యులు, జిల్లా ఓ బి సి సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్,జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, దేవత్ దివ్య, రమా,దామా స్వరూప, బిక్కసాని స్వరూప, ఏలూరి రజని,ఊరుకొండ చంద్రిక,బలుసు లక్ష్మీ, నీలవేణి,భవానీ,నసీమా, రమాదేవి తదితర నాయకులు పాల్గొన్నారు.





# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలని, మన పరిధిలో ఉన్న వాటికి సంబంధించి పనిని వెంటనే పూర్తి చేయాలని, మనం చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనల వివరాలను తెలుపుతూ లేఖ రాయాలని కలెక్టర్ సూచించారు. వార్తా పత్రికలలో ప్రచురితమయ్యే వ్యతిరేక వార్తలపై క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యల వివరాలు అందించాలని, దీనిపై డిఆర్ఓ సమీక్ష చేయాలని అన్నారు. ఈఈ హౌసింగ్, డిఆర్డిఓ, డిపిఓ, డి.ఎం.హెచ్.ఓ, వివిధ శాఖల వద్ద పత్రికలలో వచ్చిన వ్యతిరేక వార్తలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన రిపోర్ట్ పెండింగ్ ఉన్నదని, వీటిని సకాలంలో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. గన్నవరం క్రాస్ రోడ్ లో గల రెబ్బవరం బస్టాండ్ ను ఆక్రమించారని, ఇట్టి ఆక్రమణలు తొలగించి బస్టాండ్ పునరుద్ధరించి ప్రయాణికులకు భరోసా కల్పిస్తూ చర్యలు తీసుకోవాలని కోరుతూ వైరా మండలం రెబ్బవరం, కొండకొడిమ, ఖానాపురం, గన్నవరం గ్రామాలకు చెందిన ప్రజలు దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వైరా మండలానికి చెందిన ఎస్. విద్యాసాగర్ సెమీ ఆర్ఫన్ స్టూడెంట్ కు ఎస్సి గురుకులంలో ఏడవ తరగతి సీట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఆర్.సి.ఓ. కు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వేంసూరు మండలం కందుకూరు రెవెన్యూ గ్రామ రైతులు తాము వరుణ్ అగ్రిటెక్ కంపెనీ వారి బిపిటి 2782 వరి విత్తనాలు కొనుగోలు చేసి వరి పంట సాగు చేశామని, ఎకరానికి 25 వేల చొప్పున ఖర్చు అయిందని, కల్తీ విత్తనాలు రావడం వల్ల తమ శ్రమ వృధా అయ్యిందని, కల్తీ విత్తనాలు విక్రయించిన వరుణ్ అగ్రిటెక్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ విచారణ చేసి వెంటనే తగుచర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్, కాంటింజెంట్, పార్ట్ టైం వర్కర్స్ యూనియన్ జె.ఏ.సి. తరపున తమకు పాత పద్ధతిలో జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు, పెండింగ్ వేతనాలు చెల్లించుటకు దరఖాస్తు సమర్పించగా పి.ఓ. ఐటిడిఏ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బోనకల్ మండలం ఆళ్ళపాడు గ్రామానికి చెందిన మరీదు శ్రీను తనకు వచ్చే దివ్యాంగుల పెన్షన్ 3 సంవత్సరాలుగా ఆగిపోయిందని, తనకు పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఆర్డీవో కు రాస్తూ తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





# గ్రామ పాలనాధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్-15, తెలంగాణ ముచ్చట్లు;** నిస్వార్థంగా పనిచేస్తూ ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్, నూతనంగా నియమించిన గ్రామ పరిపాలన అధికారులకు సోమవారం పోస్టింగ్ ఆర్డర్ లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థను గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గ్రామాల్లో గ్రామ పరిపాలనా అధికారులను నియమించిందని తెలిపారు. జిల్లాలో 299 క్లస్టర్ లకు గాను 252 మంది అర్హులైన వారికి మెరిట్ ప్రకారం వారి స్వంత మండలం మినహాయించి, ఇతర ప్రదేశాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామ పరిపాలన అధికారులుగా పోస్టింగు ఇచ్చినట్లు తెలిపారు.

గ్రామ పాలన అధికారులు భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన నూతన రెవెన్యూ చట్టం భూ భారతి ను పటిష్టంగా అమలు చేసేందుకు బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ప్రజల భూ సమస్యల పరిష్కారం పట్ల, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని, ఉత్తమ సేవలతో రెవెన్యూ శాఖకు, జిల్లాకు మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు.

రెవెన్యూ శాఖ ప్రభుత్వంలో చాలా కీలకమని ప్రభుత్వ భూముల సంరక్షణ, ప్రైవేటు, పట్టా భూముల నిర్వహణ, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల జారీ వంటి అనేక కీలక బాధ్యతలు మన వద్ద ఉంటాయని, నిబంధనల ప్రకారం ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో అందించాలని, ఎక్కడ అవకతవకలకు పాల్పడడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సిటిజన్ చార్ట్ ప్రకారం ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చూడాలని, క్షేత్రస్థాయిలో గ్రామ పాలన అధికారులను నిరంతరం పర్యవేక్షిస్తామని అన్నారు. నేడు నియామక పత్రాలు పొందుతున్న అభ్యర్థులు వెంటనే విధులలో చేరాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ సంఘం జిల్లా అధ్యక్షులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, నూతన గ్రామ పరిపాలన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# ఘనంగా ఎంపీజే జిల్లా కార్యవర్గ సమావేశం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) జిల్లా కార్యవర్గ సమావేశం సోమ వారం, ఎంపిజే జిల్లా ప్రధాన కార్యాలయం లో ఘనంగా జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్ అధ్యక్షత వహించగా, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనపై సభ్యులు చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంపీజే జిల్లా కోశాధికారి ఎం.డి. హకీమ్ ఇటీవల రిటైర్మెంట్ పొందిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన సేవలను ప్రశంసిస్తూ, కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్ తో పాటు, కోశాధికారి ఎం.డి. హకీమ్, కార్యదర్శులు రజబాలి, బొగ్గవరపు సతీష్, రఫీక్, జి. శ్రీనివాస్ (ఆర్.ఓ), బుర్ర వెంకటేశ్వర్లు, మాజీకార్పొరేటర్లు కనకం భద్రయ్య, దడాల రఘు, మీడియా కన్వీనర్ టి.ఎస్. చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో 17న మెగా రక్తదాన శిబిరం




- మోడీ జన్మదినం, విమోచన దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం
- సేవాభావంతో ప్రజలు ముందుకు రావాలి.
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలో ఈనెల 17వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సోమవారం ప్రకటించారు.

ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. సేవా భావంతో రక్తదానం చేయడం వల్ల అనేక మంది ప్రాణాలు కాపాడబడతాయని, ప్రతి పౌరుడు ఒక ప్రాణరక్షకుడిగా నిలుస్తారని అన్నారు. మోడీ జన్మదినాన్ని గుర్తించేందుకు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఖమ్మంలో రక్తదాన శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆయన వివరించారు. అదే విధంగా తెలంగాణ విమోచన దినోత్సవం, మోడీ జన్మదినం ఒకే రోజు రావడం చారిత్రక ప్రత్యేకత. ఈ సందర్భాన్ని గుర్తించేందుకు పార్టీ తరపున శ్రేయోభిలాషులు, యువత, కార్యకర్తలతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి ప్రజలందరూ ముందుకు వచ్చి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.





# వికలాంగుల పెన్షన్ల హామీ అమలు చేయాలని డిమాండ్

**కాప్రా తహసిల్దార్ కార్యాలయ ముట్టడి చేసిన వికలాంగులు, సంఘ నాయకులు**

**కాప్రా, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీగా ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎన్. వినయ్ నాయకత్వం వహించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వికలాంగుల పెన్షన్‌ను రూ. 4000 నుంచి రూ. 6900కి పెంచుతామని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత కార్మికుల పెన్షన్‌ను రూ. 2000 నుంచి రూ. 4000కి పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఈ హామీ అమలు చేయకపోవడం దారుణమని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అలాగే వికలాంగులకు 5 శాతం కోటా ప్రకారం గృహాలను కట్టివ్వాలని జి.ఓ ఉన్నప్పటికీ,ఇప్పటివరకు ప్రభుత్వం ఈవిషయాన్ని పట్టించు కోలేదని వారు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్లు తక్షణమే మంజూరు చేయాలని,ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు గత మూడు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నా, ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని నాయకులు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో సోమవారం అన్ని మండల కార్యాలయాల వద్ద ఒకేసారి ధర్నా నిర్వహించారు.కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ నిరసనలో పాల్గొన్న వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు. ధర్నా ప్రారంభానికి ముందు ఎం.ఏ.పి.ఎస్ కళామండలి పాటలతో ప్రజల్లో ఉత్సాహం నింపారు.ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పి.ఎస్ జాతీయ నాయకులు,మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జ్ తిప్పరపు లక్ష్మణ్ మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి నర్సింహా, గంగపుత్ర శ్రీనివాస్, ధనరాజ్, రాంచందర్ మాదిగ, శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.





# చిల్కానగర్ డివిజన్ పార్కులకు మహర్దశ

## కోటి రూపాయల ప్రతిపాదనలు చేసిన కార్పొరేటర్ గీతా ప్రవీణ్

**చిల్కానగర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)** : ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ లోని పార్కుల అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ (యుబిడి) కోటి రూపాయల ప్రతిపాదనలు చేశారు. హార్టికల్చర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ అన్నపూర్ణ తో కలిసి పార్కులను సందర్శించి, కొత్త పనులు వెంటనే సాంక్షన్ చేయాలని కోరారు.బాలాజీ ఎంక్లేవ్ పార్క్ లో కాంపౌండ్ వాల్ మరమ్మత్తు,పెయింటింగ్, నూతన గేట్, వాటర్ బోర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఫ్రీడమ్ పార్క్ లో వాకింగ్ ట్రాక్, బెంచీలు, ప్రహరీ గోడ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. నార్త్ కళ్యాణపురి పార్క్ లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్‌ను బయటకు మార్చాలని, వాచ్మెన్ రూమ్, టాయిలెట్లు పూర్తి చేయాలని, ఆకతాయిలు గంజాయి సేవించడం నివారించేందుకు సీసీ కెమెరాలు అమర్చాలని కోరారు. అదేవిధంగా జిమ్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కళ్యాణపురి పార్క్ లో జిమ్ ఎక్విప్మెంట్ అమర్చాలని చెప్పారు.బ్యాంక్ కాలనీ పార్క్ లో వాచ్మెన్ రూమ్, సీసీ కెమెరాలు, పిల్లల ఆట సామగ్రి ఏర్పాటు చేయాలని, టాయిలెట్లను మరోమూలలోకి మార్చాలని కోరారు. రాఘవేందర్ నగర్ పార్క్ లో వాకింగ్ ట్రాక్, గజబో,బెంచీలు,ఓపెన్ జిమ్, ప్లే టేబుల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.హార్టికల్చర్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ పూర్ణ మాట్లాడుతూ, కొత్త ప్రతిపాదనలు త్వరగా సాంక్షన్ చేస్తామని, ఇప్పటికే సాంక్షన్ అయిన పనులను కాంట్రాక్టర్లతో పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్, డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణకి శాల్ తో సత్కారం చేసి, బాలాజీ ఎంక్లేవ్ పార్క్ లో ఏర్పాటు చేసిన గజబో, గార్డెన్ గ్రాస్, బెంచీలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కోకొండ జగన్, వివిధ కాలనీ అధ్యక్షులు, కార్యదర్శులు —— జగదీశ్వర్ రెడ్డి, వలి (బాలాజీ ఎంక్లేవ్), శివారెడ్డి, వికాస్ (కళ్యాణపురి), గఫూర్, సందీప్ భూషణ్, వెంకటేశం (బ్యాంక్ కాలనీ) పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

- రూ.1 కోటి తో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

**ఉప్పల్, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. స్థానిక కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి తరచూ పనులను పర్యవేక్షిస్తూ ఉంటున్నారు.సోమవారం ఆయన ఉప్పల్ హిల్స్ కాలనీలో పర్యటించి, 93 లక్షల రూపాయలతో సీసీ రోడ్లు, 7 లక్షల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఏఈ రాజ్‌కుమార్ తో కలిసి కాలనీ వాసుల సమక్షంలో పరిశీలించారు.అదనంగా, ఉప్పల్ హిల్స్ 40 ఫీట్ల రోడ్ నుండి హనుమాన్ దేవాలయం వరకు 65 లక్షల రూపాయల తో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని కార్పొరేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, దుర్గం నవీన్ యాదవ్, గోవింద్ కుమార్ స్వామి, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, పి.రామచందర్, ఎం.సుధాకర్ రెడ్డి, టి.విజయ్ సింగ్, ఈ.మహేందర్, టి.శ్రీనివాస్ రెడ్డి, ఏ.రవి, జి.కొమురయ్య, వెంకటేష్ గౌడ్, ఏ.బిక్షపతి, ఏ.రాజు, ఎండి.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.




# డాక్టర్ పత్తిపాటి లక్ష్మీ కాంతమ్మ కు అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు ప్రధానం

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు గ్రహీత. డాక్టర్. లక్ష్మి కాంతమ్మ కీ నేషనల్ జానపద కళాకారిణి మరియు బుర్రకథ కళాకారిణిగా సమాజ సేవకురాలిగా గత ఇరవై సంవత్సరాలుగా ప్రజలతో కలిసి పోతూ తనకు ఉన్న స్వరము తో పాట మాట ఆట తో ఎంతోమంది పేద ప్రజలతో ముందుకి వెళ్ళు చున్న లక్ష్మికాంతమ్మ ది అనంతసాగర్ గ్రామం చింతకాని మండలం. ఖమ్మం జిల్లా ఈ విధంగా ప్రజలలో ముందుకి వెళ్లుచున్నలక్ష్మికాంతమ్మ కృషిని గుర్తించిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ తరుపున విశాఖరత్న కళా పరిషత్ 27 వార్షికోత్సవ వేడుకలు కళాసంబరాల సందర్భముగా అల్లూరి సీతారామరాజు అడిటోరియం లో ఈ అవార్డు ప్రధానం జరిగినది.. కళా భూషణ్ డాక్టర్.. పి. ఏ. భాస్కర్ రావు బుక్ ఆఫ్ రికార్డ్.. ఇండియన్. ఆధ్వర్యములో అవార్డు ప్రకటించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పైడా కృష్ణ ప్రసాద్ చైర్మన్ (విద్యా సంస్థ అధినేత ఏ. పి )డాక్టర్ కేందూరి చంద్ర మౌళి ( రిటైర్డ్ ప్రొఫెసర్ ఆంధ్రా యూనివర్సిటీ ) బొమ్మిడిసత్యనారాయణ. విశాఖరత్న అవార్డు గ్రహీత అదేవిధముగా పలువురు సినిమా దర్శకులు నిర్మాతలు. హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.. ఈ సందర్భంగా లక్ష్మికాంతం మాట్లాడుతూ.. చిన్న నాటినుండి నేను కళా రంగంలో ముందుంటూ సామాజిక గేయాలు జానపద గేయాలు బుర్రకథలు.. మరియు ముఖ్యమైన ది సేవ ఈ సేవ లోఎంతో తృప్తి ఉంటుంది మంచి మాట, మంచి బాట ఇలా ప్రజల్లోనే సేవ చేస్తూ సంతోషముగా ఉంటున్నాను నేను ఎంచుకున్న వృత్తి నాకు ఎంతో గౌరవ మర్యాదలు కల్పిస్తున్నందుకు సమాజానికి కృతజ్ఞతలు తెలుపుచున్నాను అని ఈ సందర్భంగా తెలియజేశారు.

# ఓపెన్ స్కూల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు..

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** ఓపెన్ స్కూల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. కలెక్టరేట్ లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల నిర్వహణపై సోమవారం సంబంధిత అధికారులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుంచి సెప్టెంబర్ 28 వరకు జరిగే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్.ఎస్.సి., ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఖమ్మం జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు సరఫరా, కనీస మౌలిక సదుపాయాల కల్పన చేయాన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్ నందు 287 మంది అభ్యర్థులకు ఓపెన్ ఎస్.ఎస్.సి. పరీక్షలు, రిక్కాబజార్ లోని జి.హెచ్.ఎస్. నందు 254మంది అభ్యర్థులకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బి.ఎన్.ఎస్. సెక్షన్ పెట్టాలని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని అన్నారు. ప్రశ్న పత్రాల తరలింపుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఉండాలని, ఏఎన్ఎంలతో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నడిచేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి కె. రవిబాబు, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అధికారి మంగపతి రావు, పోలీస్, మునిసిపల్, పోస్టల్, విద్యుత్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రవి నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు

**నాచారం, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులుగా నేనావత్ రవి నాయక్ నియమితులైన సందర్భంగా నాచారం డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకం గా కలసి శాలువాతో సత్కరించారు.పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన వారిని గుర్తించి గౌరవించడం బీజేపీ సంప్రదాయమని, రాబోయే రోజుల్లో రవి నాయక్ పార్టీ బలోపేతానికి కృషి చేసి, ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, చంద్రమౌళి, రాజిరెడ్డి, హన్మంత్ బిరాధర్, యోగేశ్వర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, గంధమల్ల గోపి, వేణుగోపాల్, క్రాంతి కుమార్, మంజుల వాణి, కళావతి, లావణ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.



## పెంచిన పెన్షన్లు ఇవ్వాలి

### తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

**కీసర, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000/కు పెంచాలని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత, బీడీ కార్మికులు తదితర పెన్షన్ దారుల పెన్షన్‌ను రూ.4,000/కు పెంచాలని, కండరాల క్షీణత బాధితులకు ప్రత్యేకంగా రూ.15,000/ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కీసర మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు జరిగిన ఈ ముట్టడిలో వికలాంగుల హక్కుల పోరాట సమితి (వి.హెచ్.పి.ఎస్), చేయూత పెన్షన్ దారుల హక్కుల పోరాట సమితి (సి.పి. హెచ్.పి.ఎస్), మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం.ఆర్.పి.ఎస్) ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడిచినా పెన్షన్ల పెంపు ఇప్పటికీ అమలు చేయలేదని, వెంటనే పెంచిన పెన్షన్లు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఉప తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆవుల అల్లాజీ, టైగర్ నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, రాజు రెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్, ముత్యం, బాలస్వామి, దత్తు, చోటు, మోహన్రావు, భాగ్యమ్మ, బిక్షపతి గౌడ్, విక్టోరి గైడెన్, మంచాల మహేందర్ మాదిగ (ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు, కీసర మండలం), బుడిగె జగన్ మాదిగ (మండల ఇంచార్జ్), తుడుం శ్రీనివాస్ మాదిగ (ఉపాధ్యక్షులు), శీలం మల్లేష్ మాదిగ, బందెల పరమేష్ మాదిగ, నల్ల చంద్రయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

**కీసర, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడి టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. సునీత, మేడ్చల్ ప్రాజెక్ట్ నాయకురాలు దుర్గా మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య తరగతులను అంగన్వాడి కేంద్రాలలోనే నిర్వహించాలనీ, విద్యాబోధన బాధ్యత అంగన్వాడీ ఉద్యోగులకే అప్పగించాలని,ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేసి ఒకే ఆన్లైన్ యాప్ అమలు చేయాలని,5జి మొబైల్ ఫోన్లు అందించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం రూ.18,000 వేతనం, పిఎఫ్ అమలు చేయాలని,మంత్రి హామీ ఇచ్చిన 24 రోజుల సమ్మె వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీవో 8 సవరణ తక్షణమే అమలు చేయాలని,పెంచిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, మూడు నెలల పిఆర్సి, మినీ టీచర్స్‌కు 11 నెలల ఏరియర్స్, రిటైర్డ్ ఉద్యోగులకు 18 నెలల సిబిఇ బకాయిలు వెంటనే చెల్లించాలని,ఖాళీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మరోవైపు నూతన జాతీయ విద్యా విధానం కారణంగా ఐసిడిఎస్ నిర్వీర్యం అవుతోందని, ప్రీ ప్రైమరీ తరగతులను విద్యాశాఖకు అప్పగించడం అంగన్వాడీ వ్యవస్థను దెబ్బతీస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే పోరాటాన్ని మరింత





# వనపర్తి జర్నలిస్టుల నిరసన

### జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి – కలెక్టర్‌కు వినతి

**వనపర్తి,సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టిన జర్నలిస్టులు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రాన్ని అందజేశారు.

జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు బక్షి శ్రీధర్ రావు మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వార్తగా ప్రసారం చేసినందుకు ఖమ్మం ఉమ్మడి జిల్లాలో టీ న్యూస్ బ్యూరో చీఫ్ సాంబశివరావుపై ఉద్దేశపూర్వకంగా నాన్‌బేయిలబుల్ కేసు నమోదు చేయడం నిరసనకు కారణమని ఆయన తెలిపారు.

జర్నలిస్టులు మాట్లాడుతూ, రైతుల సమస్యలపై రాసిన వార్తలకుగాను మీడియాపై అక్రమ కేసులు నమోదు చేయడం మానవ హక్కులకు విరుద్ధమని, కుట్రపూరితంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నరసింహారెడ్డి, ఆనంద్, సుంకరి నగేష్, జగత్ పల్లి శ్రీనివాస్, రాజు, జానీ, సుంకరి రమేష్, గోవర్ధన్, మన్నాజీ, భాను ప్రకాష్, అశోక్, ఈశ్వర్, గోపాల్, చెన్నయ్య, రాధాకృష్ణరెడ్డి, రాములు, అబ్దుల్ హమీద్, ఖలీల్, శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# పెన్షన్ పెంచకపోతే ఉద్యమం తీవ్రతరం

### మల్కాజిగిరి తహసిల్దార్ కార్యాలయ ముట్టడి చేసిన వికలాంగులు, సంఘ నాయకులు

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో పెన్షన్‌దారులు, వికలాంగులు ఎదురు చూస్తున్న పెన్షన్ వృద్ధి కోసం పోరాటం ముదురుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలను అమలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు సోమవారం మల్కాజిగిరి తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు." హామీ నెరవేర్చాలి – పెన్షన్ పెంచాలి"అంటూ నినాదాలు చేసిన నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ మాట్లాడుతూ ఎన్నికల ముందు వికలాంగులకు 4 వేల నుండి 6 వేల, సాధారణ పెన్షన్ దారులకు 2 వేల నుండి 4 వేల పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ అధికారం లోకి వచ్చి 20 నెలలు గడిచినా మాట నిలబెట్టుకోలేదు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం" అని విమర్శించారు.ఇకపై హామీ అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రజల జీవనాధారం అయిన పెన్షన్ పెంపు సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.






# అక్రమ కేసులపై జర్నలిస్టుల నిరసన

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు:**

**టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఆధ్వర్యంలో జడ్పీ సెంటర్లో నల్ల జెండాలతో ప్రదర్శన**
**భారీగా హాజరైన విలేకరులు**
**మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ఐజేయు నాయకులు**

జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులపై ఖమ్మం జిల్లా జర్నలిస్టులు గళమెత్తారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రశ్నిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్ జిల్లా బ్యూరో సాంబశివరావు, కెమెరామెన్ నాగరాజు పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలంటూ నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేశారు. టియుడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు ఐజేయు నేతలు సంఘీభావం ప్రకటించి, నిరసనలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావడంతో ఖమ్మం జడ్పీ సెంటర్ నినాదాలతో దద్దరిల్లింది. జర్నలిస్ట్ సాంబశివరావుతో పాటు కెమెరామెన్ తమ విధుల్లో భాగంగా యూరియా కొరతపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా అని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రభుత్వాల తప్పులను ఎత్తిచూపటమే జర్నలిస్టుల డ్యూటీ అని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అవమానించేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కావాలని, దురుద్దేశపూర్వకంగానే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రైతుతో తప్పుడు కేసు పెట్టించారని ఫైరయ్యారు. ప్రభుత్వం తప్పులుంటే సరిదిద్దుకోవాలి తప్పించి, వార్తను రిపోర్టు చేసిన విలేకరులపై కేసులు పెడతారా అని మండిపడ్డారు. సాంబశివరావు, నాగరాజు పై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆందోళనలో పాల్గొన్న ఐజేయు నాయకులు..

టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో...

టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్వనేని వెంకట్రావు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు పాల్గొని ప్రసంగించారు.

నల్ల జెండాలతో అంబేద్కర్ సెంటర్లో జర్నలిస్టులు నిరసన...

తొలుత సోమవారం ఉదయం జర్నలిస్టు సాంబశివరావుతో పాటు ఆ ఛానల్ కెమెరామెన్, మరో సహాయకుని పై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మంలోని జిల్లా పరిషత్ (అంబేద్కర్) సెంటర్లో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నల్లజెండాలు చేతబట్టి నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ దిన పత్రికలు, శాటిలైట్ చానళ్లకు చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు, కేబుల్, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (టీజెఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, వనం నాగయ్య, ప్రశాంత్ రెడ్డి, శెట్టి రజనీకాంత్, జిల్లా నాయకులు అడపాల నాగేందర్, దుంపల భాస్కర్, కలవకొలను హరీష్, మందటి వెంకటరమణ, మందుల ఉపేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఆర్టివి జిల్లా ఇన్చార్జి ఉదయ్, శేఖర్, టీఎస్ చక్రవర్తి, అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్, కార్యదర్శి అశోక్, సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, సంతోష్, కాపర్తి నరేంద్ర, బిక్కి గోపి, ముత్యాల కోటేశ్వరరావు, వెంకటకృష్ణ, అంతోటి శ్రీనివాస్, జీవన్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నల్లమోతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఐజెయూ నేతలు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం భూపాల్, మహేందర్, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, జిల్లా కోశాధికారి శివానంద, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్, నగర ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, మీడియా ప్రతినిధులు శ్రీధర్, నారాయణ, సత్యనారాయణ, వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# వెల్టూర్ చెరువు సుందరీకరణ వృథా

- మందుబాబులకు అడ్డాగా మారిన వెల్టూర్ చెరువు కట్ట
- చెరువు కట్టపై 62 సోలార్ లైట్లు ధ్వంసం, గ్రామస్తులు ఆగ్రహం

**పెద్దమందడి,సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని గోపాల సముద్రం చెరువు ఇటీవల పునర్నిర్మాణం చేసి, చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ తరహాలో తీర్చిదిద్దారు. చెరువు సుందరీకరణలో భాగంగా కట్టకు ఇరువైపులా సోలార్ లైట్లు అమర్చి ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన చెరువు కట్ట గ్రామానికి ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకువచ్చింది.
అయితే, ఈ అందాలను కాపాడుకోవాల్సిన బదులు చెరువు కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. గుర్తు తెలియని వ్యక్తులు చెరువు కట్టకు ఇరువైపులా అమర్చిన 62 సోలార్ లైట్లను ధ్వంసం చేశారు. ఈ ఘటనతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
"చెరువు కట్ట దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఇలాంటి సంఘటనలు జరగవు," అని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి గ్రామస్తుడి బాధ్యత అని, సుందరీకరణ కోసం ఖర్చు చేసిన నిధులు వృథా కావడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
"మన ఊరు - మన ప్రదేశం - మన ప్రకృతి "ని సంరక్షించుకోవాలని, ఇటువంటి ధ్వంసకర చర్యలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.





# నకిలీ విత్తనాలతో రైతుల పంటలు నాశనం

- కందుకూరు, భరిణిపాడు రైతుల పొలాల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే .
- నష్టపరిహారం కల్పిస్తామని భరోసా

**వేంసూరు, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలం కందుకూరు, భరిణిపాడు గ్రామాల రైతులు నకిలీ విత్తనాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరుణ్ ఆగ్రో టెక్ సంస్థ అందించిన 2782 నెంబర్ వరి విత్తనాలుతో దాదాపు 3 వేల ఎకరాల్లో విత్తిన పంటలు విఫలమై రైతులు ఆందోళన చెందుతున్నారు.
ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ఈరోజు ఉదయం కందుకూరు, భరిణిపాడు గ్రామాల రైతుల పొలాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. నష్టపోయిన పంటలను పరిశీలించిన అనంతరం కందుకూరు పంచాయతీ కార్యాలయంలో, తరువాత భరిణిపాడు గ్రామంలో రైతులు, అధికారులు కలిసి సమావేశాలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరుల నుండి పూర్తి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ, రైతు నష్టపోతే ప్రభుత్వం కళ్లుమూసుకుని ఉండదు. నకిలీ విత్తనాల కారణంగా ఎవరికైనా నష్టం జరిగితే వారికి తప్పకుండా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కంపెనీలపై కఠిన చర్యలు తప్పవు. అధికారులు వెంటనే విచారణ పూర్తి చేసి తగిన నివేదికను సమర్పించాలని ఆదేశించాం అని అన్నారు. రైతులకు ధైర్యం చెబుతూ, అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, వైస్ చైర్మన్ వెంకటప్పరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎస్సై, ఏఓ, ఏఈఓ, కార్యదర్శి తదితరులు, రైతు సోదరులు పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు వెల్ది జగన్మోహన్ రావు, దొడ్డా శ్రీను, సుబ్బారెడ్డి, ఫజుద్దీన్, వెంకటేశ్వర రెడ్డి, నాని, స్థానిక నాయకులు, మహిళా, యువజన నాయకులు, కార్యకర్తలు గణనీయంగా హాజరయ్యారు.






# వాక్యాధారమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

- బోధనలో లేఖానుసారమైన ధర్మశాస్త్రము, ఆరాధన దినములు, పండుగలు జరగాలి
- నేషనల్ బైబిల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకులు ప్రొపెసర్ డాక్టర్ యస్. జాన్ రాజ్

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15 , తెలంగాణ ముచ్చట్లు;** పరిశుద్ధమైన బైబిల్ గ్రంథం ప్రకారం వాక్యాధారమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా నేషనల్ బైబిల్ కాన్ఫరెన్స్(యన్.బి.సి) టీమ్ పనిచేస్తుందని నేషనల్ బైబిల్ కాన్ఫరెన్స్ వ్యవస్థాపకులు, ప్రొపెసర్ డాక్టర్ యస్. జాన్ రాజ్ అన్నారు. ఖమ్మం జిల్లా, వైరా పట్టణం శాంతినగర్ లోని 'యావె సమాజ ప్రార్థన మందిరం'లో సోమవారం ఖమ్మం జిల్లా యన్.బి.సి ఎగ్జిక్యూటివ్ లీడర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ డాక్టర్ యస్. జాన్ రాజ్ మాట్లాడుతూ... వాక్యాధారమైన బోధలను ఈ సమాజానికి అందించి వారిని సర్వసత్యం వైపు నడిపించుటకొరకు సేవకులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా బైబిల్ కు వ్యతిరేకంగా బైబిల్లో లేని పండుగలు, ఆరాధ దినములు చేయు బోధనలను ఖండించాలి, లేదా వారికి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే 2026 సంవత్సరం నుండి భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో యన్.బి.సి ద్వారా అనేక కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. అనంతరం ఖమ్మం జిల్లా యన్.బి.సి ఎగ్జిక్యూటివ్ లీడర్స్ కమిటీని నియమించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా దేవుని సంఘం అధ్యక్షులు టి.వి రావు, నేషనల్ ఎగ్జిక్యూటివ్ లీడర్(యన్.బి.సి) డాక్టర్ ఐజక్ ఇ.కుసుమ, నేషనల్ ఎగ్జిక్యూటివ్ లీడర్(యన్.బి.సి), యావె సమాజ సేవకులు, ఎల్డర్ పాలడుగు రత్నపాల్, తో పాటు ఖమ్మం జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ లీడర్స్ ను ఎన్నుకోవడం జరిగింది. అడ్వైజర్ కమిటీ మెంబర్ ఎల్డర్ టి.వి రావు, ఎల్డర్ టి. సత్యవాది, ఎల్డర్ యం. ఎలీషా, ఎల్డర్ జి. దయాకర్, ఎల్డర్ యం.స్టీఫెన్, ఎల్డర్ ఐ. ఇస్సాక్ రాజ్, ఎల్డర్ ఏ. ఆనందం, ఎల్డర్ ఆర్. కరుణాకర్, ఎల్డర్ కె. చిన్నబాబు, ఎల్డర్ టి. శ్యాంసన్ తదితరులు నియమించబడ్డారు. ఈ కార్యక్రమంలో దేవుని సంఘ పాస్టర్లు సువార్తికులు, సంఘస్తులు హాజరైనారు.

# సత్తుపల్లి కాంట్రాక్ట్ కార్మికులతో ఐఎన్టియుసి సభ్యత్వ డ్రైవ్!

బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్



**సత్తుపల్లి, సెప్టెంబర్ 15(తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పిట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో ఐఎన్టియుసి నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా తీగల క్రాంతికుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఐఎన్టియుసి ఎల్లప్పుడూ కృషి చేస్తోందన్నారు. సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ యూనియన్ సమష్టిగా ఉద్యమించి, గత ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులకు 5,000 రూపాయల ఆర్థిక సహాయం ఇప్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని గుర్తు చేశారు.సింగరేణి సంస్థలో సుమారు 25 వేల మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారందరూ యూనియన్ సభ్యత్వం తీసుకుని ఐఎన్టియుసి బలోపేతానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఐఎన్టియుసి బ్రాంచ్ నాయకులు, పిట్ సెక్రటరీలు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, వివిధ కమిటీ నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# పెన్షన్ పెంపు వరకు పోరాటం ఆగదు

ఎమ్మార్పీఎస్ నాయకులు

**పెద్దమందడి,సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** పెన్షన్లు పెంచేంతవరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని వదలబోమని ఎమ్ఆర్పిఎస్ నాయకులు స్పష్టం చేశారు. పెద్దలు, వికలాంగులు, వితంతువులను మోసం చేసిన ముఖ్యమంత్రికి పాలన చేయడానికి నైతిక అర్హత లేదని అన్నారు. పెన్షన్లు పెంచకపోతే కాంగ్రెస్ పార్టీ రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
పెద్దమందడి మండల కేంద్రంలోని మండల రెవెన్యూ అధికారి కార్యాలయాన్ని పెన్షన్ దారులు ముట్టడించారు. మండల బాధ్యులు ఎద్దుల వెంకటేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన మహాధర్నాలో కొమ్ము చెన్నకేశవులు మాదిగ, టైగర్ జంగయ్య మాదిగ, గంధం గట్టయ్య తదితరులు మాట్లాడారు.

ఎన్నికల హామీపై విమర్శలు

"2023 ఎన్నికల సమయంలో వికలాంగులకు ఆరు వేల రూపాయలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నాలుగు వేల రూపాయలు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదు. ఏడు సంవత్సరాలుగా కొత్త పెన్షన్లు మంజూరు కాక పేదల గోస వినిపించడం లేదు" అని వారు ప్రశ్నించారు.

ప్రభుత్వంపై ఆరోపణలు

భూస్వాములకు రైతు బంధు, రుణమాఫీ అమలు చేస్తున్న ప్రభుత్వం అత్యంత పేదలకు పెన్షన్లు పెంచకపోవడం అన్యాయం అని మండిపడ్డారు. పెన్షన్ దారులను దగా చేస్తున్నా ప్రతిపక్షాలు కూడా నోరు విప్పకపోవడం విచారకరమని అన్నారు.

భవిష్యత్ పోరాటాల హెచ్చరిక

ఈ నెల ఇరవై తేదీన అన్ని గ్రామ పంచాయితీల వద్ద మహాధర్నాలు, తరువాత రాష్ట్రవ్యాప్తంగా రహదారుల దిగ్బంధాలు చేపడతామని చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబరు రెండో వారంలో లక్షలాది మంది పెన్షన్ దారులతో హైదరాబాద్‌లో మహాగర్జన సభ నిర్వహించి తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు.
ధర్నా అనంతరం పెన్షన్లకు సంబంధించిన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ రమేష్ మురళి గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాలాల్ సేవా సమితి అధ్యక్షుడు కిషన్ నాయక్, హనుమంతు మాదిగ, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేద ప్రజలకు వరం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎంపీ ఈటల రాజేందర్

**నాగారం, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** నిరుపేదల ఆరోగ్య భద్రత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి నిజమైన వరమని పేర్కొన్నారు.మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో, నాగారం మున్సిపాలిటీకి చెందిన ఎమ్. జాన్ కెన్నెడీకి రూ.60 వేలు, కె. అనిల్ కుమార్‌కు రూ.46,500 సహాయాన్ని కార్పొరేట్ ఆసుపత్రి వైద్య ఖర్చులలో భాగంగా అందించారు.ఈ చెక్కులను సోమవారం ఎంపీ ఈటల రాజేందర్, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ చంద్రరెడ్డి మాట్లాడుతూ,బాధిత కుటుంబాలకు అండగా నిలిచి, సీఎం సహాయ నిధి ద్వారా సహకరించిన ఎంపీ ఈటల రాజేందర్ కి కృతజ్ఞతలు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# వనపర్తి విద్యార్థినికి రాష్ట్రస్థాయి గౌరవం

పిజి ప్రవేశ పరీక్షలో పదవ ర్యాంకు సాధించిన నందిపేట గీత



**వనపర్తి,సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన నందిపేట గీత రాష్ట్ర స్థాయి తెలంగాణ సాధారణ పిజి ప్రవేశ పరీక్ష-2025 లో ప్రతిభ కనబరచి పదవ ర్యాంకు సాధించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో గీత సామాజశాస్త్రం విభాగంలో ఉత్తమ మార్కులు సాధించి అర్హత పొందింది. సాధారణ కుటుంబానికి చెందిన ఆమె తండ్రి నందిపేట రాములు ట్రాక్టర్ నడుపుతూ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ విజయంతో గీత తన కుటుంబానికే కాకుండా, గ్రామానికి, వనపర్తి జిల్లాకే గర్వకారణంగా నిలిచింది. ఆమె విజయంపై బంధుమిత్రులు, అధ్యాపకులు, గ్రామ పెద్దలు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి : సిఐటియు

**మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు)**: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మూడు చింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపల్ కార్మికులకు మూడు నెలల వేతనాలు, అలియాబాద్ మున్సిపల్ కార్మికులకు రెండు నెలల వేతనాలు బకాయిలుగా ఉన్నాయని వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాధిక గుప్తా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, “ప్రతి నెల జీతం మీద ఆధారపడి కుటుంబాలు నడిపే నిరుపేద మున్సిపల్ కార్మికులు మూడు నెలలుగా జీతం రాక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల గురించి 24 గంటలు మాట్లాడుతుంది కానీ పేద కార్మికుల జీతాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం చూపుతోంది” అని విమర్శించారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు వస్తుంటే చిన్న వేతనాలు పొందే మున్సిపల్ కార్మికులకు మాత్రం జీతాలు బకాయిలు పెట్టడం అన్యాయం అన్నారు. వెంటనే బకాయిలను చెల్లించి ఇకపై ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ నాయకులు ప్రశాంత్, శ్రీను, సిఐటియు నాయకులు సంతోష్, కిష్టప్ప, ఉన్నికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి**

**నాగారం, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ఇందిరా ప్రియదర్శిని కాలనీలో లబ్ధిదారు బరిగే లక్ష్మీ రాజు ఇల్లు స్లాబ్ వేయడం సోమవారం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, సీనియర్ నాయకుడు చిన్నం రాజు సతీష్ గౌడ్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భం గా మాట్లాడుతూ, “ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇల్లు కట్టించి అందించడం గొప్ప పని. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనాత్మక నిర్ణయం తీసుకొని నిరుపేదలకు జీవన భరోసా కల్పిస్తున్నారు. ఇల్లు లేని కుటుంబంలో ఒక శాశ్వత చిరునవ్వు నింపడం ఈ పథక లక్ష్యం” అని పేర్కొన్నారు. అలాగే, “లేనివారి అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. పేద ప్రజలు అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఇది కేవలం ఒక నిర్మాణం కాదు, నిరుపేద కుటుంబాలకు కొత్త జీవన శకానికి శ్రీకారం” అని ఆయన స్పష్టం చేశారు.తరువాత లబ్ధిదారులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, సతీష్ గౌడ్ లకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దానోహం నర్సింగ్ రావు, కాలనీ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, సంగీత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలి

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 15 (తెలంగాణ ముచ్చట్లు):** అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి అంగన్వాడీ యూనియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ & హెల్పర్స్ యూనియన్ (సి ఐ టి యు) ప్రధాన కార్యదర్శి బి. శోభారాణి, అల్వాల్ ప్రాజెక్ట్ సహాయ కార్యదర్శి శిరీష మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య నిర్వహించాలని, బోధనా బాధ్యతలను అంగన్వాడీ టీచర్స్‌కి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు, ఒకే ఆన్‌లైన్ యాప్ అమలు, ఉద్యోగులందరికీ 5జి మొబైల్ ఫోన్లు అందించాలని కోరారు.కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం రూ.18,000 వేతనం, పీఎఫ్ అమలు చేయాలని, అలాగే 24 రోజుల సమ్మె వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.మినీ టీచర్స్ కు 11 నెలల ఏరియర్స్, రిటైర్డ్ ఉద్యోగులకు



18 నెలల సి.బి.ఇ. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని స్పష్టంచేశారు.నాయకులు మరింతగా మాట్లాడుతూ, కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) ద్వారా ఐసిడిఎస్, విద్యా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మెకు దిగుతారని హెచ్చరించారు.






# గ్రీన్ ఫీల్డ్ హైవే సమస్యల పరిష్కారానికి కృషి..

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** గ్రీన్ ఫీల్డ్ హైవే కు సంబంధించిన రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే భూ సేకరణ సమస్యలపై సంబంధిత వేంసూరు, సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండల రైతులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సత్తుపల్లి ఎమ్మెల్యే సూచనల మేరకు దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హై వే కు సంబంధించి రైతుల సమస్యలను నోట్ చేసుకోవడం జరిగిందని, జిల్లా స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద సర్వీస్ రోడ్డు డిమాండ్ ను జాతీయ రహదారుల అధికారుల దృష్టికి తీసుకొని వెళ్తానని, హైవే వద్ద ఉన్న డ్రెయిన్స్ సామర్థ్యం పెంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. భూ సేకరణ సంబంధించి రేట్ ను తన పరిధి మేరకు ఆర్బిట్రేషన్ లో మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రైతులకు అన్యాయం చేయాలని ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, జాతీయ రహదారి రావడం వల్ల మన భూముల విలువ పెరుగుతుందని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను ధర్నాలతో అడ్డుకోవద్దని కలెక్టర్ కోరారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా నిబంధనల మేరకు న్యాయం చేసేందుకు తాను కృషి చేస్తానని అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న 40 కి.మీ. కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవే కు తప్పనిసరిగా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు ఉండాలని, లేని పక్షంలో రైతులకు చాలా ఇబ్బందులు వస్తాయని, వరదల సమయంలో నీరు పొలాలకు వెళ్లడం వల్ల ఆర్థికంగా కూడా రైతులు నష్టపోతారని, వీరికి తగిన న్యాయం చేయాలని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద సర్వీస్ రోడ్డు వేయడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను పటిష్టంగా చేయాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలలో రోడ్ల విధ్వంసం జరిగిందని అక్కడ పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ వల్ల రైతులకు వ్యవసాయం చేయడం సాధ్యం కావడం లేదని, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నామని అన్నారు. హైవే నిర్మాణ సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సర్వీస్ రోడ్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నేషనల్ హై వే పి.డి. దివ్య, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# ఎస్.ఐ.ఆర్. నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి..

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 15, తెలంగాణ ముచ్చట్లు;** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2002 పై జిల్లా కలెక్టర్లతో, రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణలకు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) చేయడం జరుగుతుందని, రాష్ట్రంలో 2002 లో ఎస్.ఐ.ఆర్. చేయడం జరిగిందని అన్నారు. ఎస్.ఐ.ఆర్. నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. వీసి అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ 2002 ఎస్.ఐ.ఆర్. తరువాత ఓటు హక్కు సంక్రమించిన ప్రతి ఒక్కరి వివరాలు ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# మరణించినవారి పేర్లపై జీతాలు

**వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో కోట్ల రూపాయల కుంభకోణం**

**కలెక్టర్ ముందు సాక్ష్యాలతో బట్టబయలు చేసిన అఖిలపక్ష ఐక్యవేదిక**

**వనపర్తి,సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీతాలను కాంట్రాక్టర్ కాజేస్తున్నాడని, అతనికి తోడుగా ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి అల్లుడు, మాజీ కౌన్సిలర్ ఉన్నారని అఖిలపక్ష ఐక్యవేదిక ఆరోపించింది. ఈ వ్యవహారంపై పలు ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ఆసుపత్రుల్లో 148 మంది సిబ్బందిని నియమించాల్సి ఉండగా, వాస్తవానికి తక్కువ మందిని మాత్రమే పని చేయించి, మిగిలిన ఖాళీల పేర్లపైనా జీతాలు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా, మరణించిన వారి పేర్లపైనా జీతాలు తీసుకోవడం జరుగుతోందని ఐక్యవేదిక బట్టబయలు చేసింది. నెలకు 10 నుంచి 20 లక్షల వరకు, గత మూడు సంవత్సరాలుగా కోట్లలో కుంభకోణం కొనసాగుతోందని ఆరోపించారు. కార్మికుల నుండి కమిషన్లు వసూలు చేయడం, భవిష్య నిధి (పీఎఫ్) మొత్తాలు ఇవ్వకపోవడం, అధికారుల కుమ్మక్కుతో ఈ దోపిడీ జరుగుతోందని పేర్కొన్నారు.

ఐక్యవేదిక డిమాండ్: కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత సూపరింటెండెంట్, ఇతర అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలి.అక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి కార్మికులకు చెల్లించాలి.ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్, గంధం నాగరాజు, నక్క కృష్ణ యాదవ్, వెంకటేశ్వర్లు, కొత్తగొల్ల శంకర్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, నక్క సురేష్ యాదవ్, గంధం భరత్ కుమార్, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి పై తప్పుడు వార్తలు

**ఎస్పి కి ఫిర్యాదు చేసిన వనపర్తి బిఆర్ఎస్ సోషల్ మీడియా**

**వనపర్తి,సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పై ఇందిరమ్మ ఇండ్ల అంశంలో తప్పుడు వార్తలు ప్రచారం చేసినందుకు, సంబంధిత మీడియా సంస్థపై చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా బిఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు జిల్లా పోలీసు అధికారి వద్ద ఫిర్యాదు చేశారు."ఇందిరమ్మ ఇండ్లు బాగున్నాయి" అంటూ తప్పుడు వ్యాఖ్యలు, అసత్య చిట్‌చాట్ పేరుతో నిరంజన్ రెడ్డి గారిపై అవాస్తవ ప్రచారం జరిగిందని వారు ఆరోపించారు. పేద ప్రజలను మభ్యపెట్టి, ఇందిరమ్మ ఇండ్ల పేరుతో బడ్జెట్ కేటాయించకుండా, ఇళ్ల నిర్మాణ బిల్లులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇరవై నెలలుగా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో నిరంజన్ రెడ్డి గారిపై తప్పుడు కథనాలను ప్రసారం చేయడాన్ని ఖండిస్తూ, సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి బిఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు మాధవరావుపల్లె సునీల్ వాల్మీకి, బిఆర్ఎస్ విద్యార్థి విభాగ అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్, యువజన విభాగ అధ్యక్షుడు సూర్యావంశం గిరి, మైనారిటీ విభాగ అధ్యక్షుడు జోహెబ్ హుస్సేన్, మండల యువజన విభాగ అధ్యక్షుడు చిట్యాల రాము, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


"రైతన్న కోసం రాజన్న" పాదయాత్రలో తెలంగాణ తొలి డిప్యూటీ సీఎం రాజయ్య


రాజన్నకు తోడుగా పాదయాత్రలో పాల్గొన్న ఆయన సతీమణి ఫాతిమా మేరీ


గులాబీ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించిన జనగాం ఎమ్మెల్యే పల్లా

# హౌజ్ అరెస్ట్‌ని అధిగమించి.. రైతన్న కోసం రాజన్న పాదయాత్ర

- హౌస్ అరెస్టు ప్రయత్నం విఫలం
- రైతు సమస్యలపై పోరాటానికి పూనుకున్న తాటికొండ రాజయ్య
- కడియం శ్రీహరి రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన దాస్యం
- గతం మర్చిపోయావా అంటూ జనగాం ఎమ్మెల్యే పల్లా ఎద్దేవా





స్టేషన్ ఘనపూర్,
సెప్టెంబర్15(తెలంగాణ ముచ్చట్లు):

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రైతుల సమస్యల పరిష్కారం (సాగునీరు,యూరియా) కోసం మాజీ ఉప ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య పాదయాత్రను నిర్వహించారు. “రైతన్న కోసం రాజన్న పాదయాత్ర” పేరుతో ఆయన విస్తృత పర్యటన చేపట్టారు. రైతులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి కష్టాలు, ఇబ్బందులను తెలుసుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సాగుతున్నారు.గత 15 రోజుల క్రితం మొదలైన పాదయాత్ర 3 విడతలుగా నిర్వహించారు.1 విడత వేలేరు మండలంలో,2 విడత చిల్పూర్ మండలంలో,3వ విడత రఘునాథపల్లి మండలంలో సోమవారం ఘనంగా ముగింపజేశారు.

### హౌజ్ అరెస్టు చేసినా వెనక్కి తగ్గని రాజయ్య

ఉదయం నుంచే పాదయాత్రను అడ్డుకోవాలని పోలీసులు హౌస్ అరెస్టు చేసినా, “రైతుల కోసం నేను వెనక్కి తగ్గను” అంటూ డాక్టర్ రాజయ్య తన పట్టుదలని ప్రదర్శించారు. అడ్డంకులు, అణచివేతలు ఎంత వచ్చినా రైతు కోసం అడుగులు ఆగవని ఆయన స్పష్టం చేశారు.సోమవారం
ఉదయమే సుబేదారి పోలీసులు హన్మకొండలోని రాజయ్య నివాసానికి చేరుకొని హౌస్ అరెస్ట్ చేశారు.విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ శ్రేణులు ఆయన ఇంటికి భారీగా చేరుకున్నారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్,నన్నపనేని నరేందర్ రాజయ్య ఇంటికి చేరుకొని సంఘీభావం తెలిపారు.అనంతరం హౌస్ అరెస్ట్ ని అధిగమించి
రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చేరుకున్న రాజయ్య, దుర్గమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర చేశారు.ఈ సందర్భంగా జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. సాగు, పంటల ఇబ్బందులు, సకాలంలో నిధుల విడుదల వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై కఠినమైన పోరాటం చేస్తానని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని, గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను స్థానిక ప్రజలతో చర్చించి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.కుర్చపల్లి,అయ్యవారిగూడెం ,గోవర్ధనగిరి,కోమళ్ల గ్రామాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే రైతులకు సరిపడా యూరియాను అందించాలని డిమాండ్ చేశారు.
సోమవారం కుర్చపల్లి, గోవర్ధనగిరి, కోమళ్ల గ్రామాల్లో పాదయాత్ర కొనసాగింది. యూరియా సరఫరా లోపాలు, సాగునీటి సమస్యలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. పార్టీ శ్రేణులు, రైతులు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొని పాదయాత్రకు విశేష స్పందన తెలిపారు.

### సిగ్గు,శరం ఉంటె కడియం రాజీనామా చేయాలి-దాస్యం



ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నైతికత,సిగ్గు,శరం ఉంటే వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై గెలిచిన ఆయన పార్టీ మారడం ప్రజాభిప్రాయానికి విరుద్ధమని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీలు మార్చుకునే నాయకత్వం ప్రజలకు మేలు చేయదని వ్యాఖ్యానించారు.

### కేసీఆర్ కి,బిఆర్ఎస్ కి వెన్నుపోటు పొడిచిన కడియం -నన్నపనేని



కేసీఆర్, బీఆర్ఎస్ ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేసి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. రాజన్న పాదయాత్రకు వస్తున్న ఆదరణ తట్టుకోలేకనే హౌస్ అరెస్ట్ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఉప ఎన్నికలు జరిగితే స్టేషన్ ఘనపూర్ గడ్డపై గులాబీ జెండా ఖచ్చితంగా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు.

### అడుగడుగున జన నీరాజనం

ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు, రైతులు బారీసంఖ్యలో పాదయాత్రలో పాల్గొన్నారు. మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా వచ్చి రాజయ్యకు అండగా నిలబడ్డారు. గ్రామాలు దాటిన ప్రతీ చోట ప్రజలు ఆయనకు నీరాజనం పట్టి, మద్దతు తెలిపి పాదయాత్రకు విశేష జోష్ నింపారు.

### పాదయాత్ర ముగింపులో రాజయ్య ఆవేదన

పాదయాత్ర ముగింపు సందర్భంగా డాక్టర్ రాజయ్య ఆవేధన వ్యక్తం చేశారు.“రైతు అన్నం పెడితేనే ఈ దేశం బతుకుతుంది. అలాంటి రైతన్నకు నీరు,యూరియా కూడా అందించలేని ప్రభుత్వం ఎందుకు? రైతు కోసం నేను ఎన్ని కష్టాలైనా భరిస్తాను. రైతు గెలిస్తేనే తెలంగాణ గెలుస్తుంది” అని అన్నారు.


పాదయాత్రలో రాజన్నకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

### గతం మరిచిపోయావా కడియం- జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



గులాబీ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించిన అనంతరం పల్లా మాట్లాడుతూ నీ గెలుపుకి కారణం ఎవరో, గతం మర్చిపోయావా కడియం అంటూ జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తల శ్రమ,ఓట్లతో గెలిచిన నీవు పార్టీ మారడం సిగ్గుచేటని ఘాటుగా విమర్శలు గుప్పించారు. దిగువ ప్రాంతాలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో 104 కోట్లతో సోడాషపల్లి వద్ద బిఆర్ఎస్ హయాంలో లిఫ్ట్ పాయింట్ ఏర్పాటు చేస్తే తన ఖాతాలో వేసుకొని తను చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.నీకు,కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటె వెంటనే పనులు చేపట్టి కుర్చపల్లి,అయ్యవారిగూడెం,గోవర్ధనగిరి,కోమళ్ల గ్రామాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.అవసరమైతే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని,కడియం ని నిలదీస్తానని పల్లా అన్నారు.
నిజాయితీకి మారు పేరుగా చెప్పుకునే కడియం పచ్చి మోసగాడు అని ఎలక్షన్స్ సమయంలో కెసిఆర్,కేటీఆర్ దగ్గర పార్టీ ఫండ్ లు తెచ్చుకొని పార్టీ పిరాయించిన మోసగాడు కడియం అని దుయ్యబట్టారు.కడియం మార్చే రంగులకు ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని అన్నారు.
రైతులకు సకాలంలో యూరియా అందించడంలో కాంగ్రెస్,బిజెపి సర్కార్ లు విఫలమయ్యాయని అన్నారు. కుర్చపల్లి గ్రామానికి అండగా ఉంటానన్న పల్లా ఆ గ్రామానికి చెందిన ప్రజలకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఘట్కేసర్ లోని తన ఆసుపత్రిలో కుర్చపల్లి గ్రామ ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని వారికి తెలియజేశారు.కేవలం కుర్చపల్లి గ్రామం అని ఏదైనా గుర్తింపు కార్డు ఉంటె సరిపోతుందని అని తెలిపారు.గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు పొగాకు బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in